సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024

సిటీలో కిసిక్ బ్యూటీ



నగరంలో సినీ నటి శ్రీలీల సందడి చేశారు. డాబాగార్డెన్స్‌లో ఓ కార్యక్రమానికి శనివారం విచ్చేసిన ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కిసిక్ పాటకు డ్యాన్స్ వేసి అభిమానులను ఉత్సాహపరిచారు. విశాఖ రావడం తనకు చాలా సంతోషంగా ఉందని, గతంలో కూడా ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు.

విక్రాంత్ పయనమెటు?



స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అతి పెద్ద నౌకగా ఐఎన్‌ఎస్ విక్రాంత్ గుర్తింపు

- యుద్ధ విమాన వాహక నౌకపై తలో మాట చెబుతున్న కమాండింగ్ చీఫ్‌లు
- విశాఖ అమ్ములపొదిలో త్వరలోనే అని చెప్పిన ఈఎన్‌సీ చీఫ్ పెంధార్కర్
- వెస్ట్రన్ నేవల్ కమాండ్‌లో చేరుతుందన్న సదరన్ చీఫ్ శ్రీనివాస్
- రక్షణ మంత్రిత్వ శాఖ దగ్గరకు విక్రాంత్‌పై ప్రకటనల పంచాయితీ

'ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ను తూర్పు నావికాదళానికి కేటాయించారు. విశాఖలో విక్రాంత్ బెర్తింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం విశాఖ పోర్టు అథారిటీతో చర్చలు జరుపుతున్నాం. విశాఖ కేంద్రంగా విక్రాంత్ త్వరలోనే సేవలు ప్రారంభించనుంది.'
– విశాఖలో ఈ నెల 2న తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ వ్యాఖ్యలు.

'ఐఎన్‌ఎస్ విక్రాంత్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ అన్ని ట్రయల్స్‌ను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. ఫ్లీట్ ఇంటిగ్రేషన్ కూడా పూర్తయింది. ఇకపై ముంబై కేంద్రంగా విక్రాంత్ పశ్చిమ నౌకాదళానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.'
– కొచ్చిలో ఈ నెల 2న సదరన్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ వి.శ్రీనివాస్ వ్యాఖ్యలు.

ఒకే యుద్ధ విమాన వాహక నౌక.. ఇద్దరు చీఫ్‌లు.. రెండు వేర్వేరు ప్రకటనలు.. అందర్నీ సందిగ్ధంలో పడేస్తున్నాయి. ఆది నుంచి విశాఖ అమ్ముల పొదిలోనే విక్రాంత్ చేరుతుందని నేవీ ప్రకటించింది. కానీ.. ఇప్పుడు రెండు భిన్నమైన వాదనలు తెరపైకి రావడం.. కొత్త సమస్యను తెచ్చినట్లుగా కనిపిస్తోంది.

సాక్షి, విశాఖపట్నం: భారత్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ని తయారుచేసి అగ్ర దేశాల చూపును తన వైపు తిప్పుకునేలా చేసింది. ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యుద్ధ నౌకలు తయారు చేసిన అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల సరసన నిలిచింది. 40 వేల టన్నుల బరువైన విక్రాంత్‌లో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌తో పాటు ఏ క్షిపణీ దెబ్బతీయని విధంగా కొచ్చి షిప్‌యార్డులో నిర్మాణం పూర్తి చేశారు. 2022 సెప్టెంబర్ 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా జాతికి అంకితం అయిన ఐఎన్‌ఎస్ విక్రాంత్.. 2023 నెలాఖరులో తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరుతుందని రక్షణ వర్గాలు ప్రకటించాయి. విక్రాంత్ రాక కోసం అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన చర్చలను తూర్పు నౌకాదళాధికారులు ఇప్పటికే మొదలుపెట్టేశారు.



పోర్టుతో కలిసి భారీ బెర్తు

నేవీ చరిత్రలోనే స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అతి పెద్ద నౌకగా ఐఎన్‌ఎస్ విక్రాంత్ బెర్తింగ్‌కు కావల్సిన సౌకర్యాలు విశాఖలో లేవు. పోర్టులో ఉన్న ఒక బెర్త్‌లో విక్రాంత్‌ని లంగరు వేసేందుకు అవకాశం ఉన్నా.. అది భద్రతకు ప్రమాదమని తూర్పు నౌకాదళం భావించింది. అందుకే.. విక్రాంత్‌కు ప్రత్యేక బెర్త్ ఏర్పాటు చేసేందుకు పోర్టు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. త్వరలోనే ఈ భారీ నౌకను లంగరు వేసేందుకు విశాఖలో ప్రత్యేక బెర్త్ ఏర్పాటు కానుంది.

చీఫ్‌ల వ్యాఖ్యలతో గందరగోళం

నేవీ డేకు ముందు ఈనెల 2వ తేదీన తూర్పు, పశ్చిమ, సదరన్ నౌకాదళాధిపతులు మీడియాతో మాట్లాడారు. ఇందులో ప్రత్యేకంగా విక్రాంత్ గురించి ఈఎన్‌సీ, ఎస్ఎన్‌సీ చీఫ్‌లు చేసిన వ్యాఖ్యలు గందరగోళంలోకి నెట్టేశాయి. ఆది నుంచి విశాఖ వస్తుందని భావించినా.. సదరన్ చీఫ్ మాత్రం వెస్ట్రన్ నేవల్ కమాండ్ నుంచి విక్రాంత్ త్వరలోనే సేవలు ప్రారంభిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం. రక్షణ పరంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన హిందూ సముద్రంలో ఆధిపత్యం కోసం మన దేశంతో పాటు చైనా, అమెరికా మొదలైన దేశాలన్నీ విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో పైచేయి సాధించేందుకు భారత్ సిద్ధం చేసిన బ్రహ్మాస్త్రమే ఐఎన్‌ఎస్ విక్రాంత్. విక్రాంత్ రాకతో రక్షణ పరంగా దుర్భేద్యంగా నిలవనుంది. అలా.. దేశంలో తయారు చేసిన అతి పెద్ద యుద్ధ నౌకగా చరిత్ర సృష్టించిన ఐఎన్‌ఎస్ విక్రాంత్.. ఇప్పుడు ఎక్కడ నుంచి సేవలు ప్రారంభిస్తుందోనన్న ఉత్సుకత నేవీ వర్గాల్లో మొదలైంది. ఇరు కమాండింగ్ చీఫ్‌లు చేసిన ప్రకటనల పంచాయితీ రక్షణ మంత్రిత్వ శాఖ దగ్గరికి చేరింది. దీనిపై నేవీ చీఫ్ త్వరలో ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

విక్రమాదిత్యని విశాఖకు కేటాయిస్తారా?

వెస్ట్రన్ నేవల్ కమాండ్ నుంచి ఇప్పటికే సేవలందిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య.. ప్రస్తుతం ఆధునీకీకరణ కోసం సిద్ధమైంది. రూ.1207.5 కోట్లతో విక్రమాదిత్య యుద్ధ విమాన వాహక నౌక షార్ట్ రీఫిట్, డ్రైడాకింగ్‌తో పాటు అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ కొచ్చి షిప్‌యార్డుతో ఇటీవలే ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో ముంబై కేంద్రంగా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ సేవలకు ఫుల్‌స్టాప్ పడింది. దీన్ని భర్తీ చేసేందుకు విక్రాంత్‌ను తాత్కాలికంగా వినియోగించనున్నారా..? లేదా విక్రాంత్‌ని ముంబైకి కేటాయించి.. అప్‌గ్రేడేషన్ చేసిన విక్రమాదిత్యని విశాఖకు కేటాయిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఐఎన్‌ఎస్ విక్రాంత్ విశ్వరూపం

- పొడవు: 262 మీటర్లు
- వెడల్పు: 62 మీటర్లు
- ఎత్తు: 59 మీటర్లు
- బరువు: 37,500 టన్నులు
- నిర్మాణ శైలి: 5 సూపర్‌స్ట్రక్చర్లు
- అంతస్తులు: 14
- కంపార్ట్‌మెంట్‌లు: 2,200
- మహిళా క్యాబిన్ 02
- రన్‌ వేలు: 2, ఒక ల్యాండింగ్ స్ట్రిప్
- సిబ్బంది: 1,750 మంది
- సాధారణ వేగం: 18 నాటికల్ మైళ్లు
- గరిష్ట వేగం: 28 నాటికల్ మైళ్లు
- సామర్థ్యం: 7,500 నాటికల్ మైళ్లు
- సత్తా ఎంత?: 30 విమానాలు, హెలికాప్టర్లను మోసుకెళ్లగలదు, గరిష్ఠంగా 40..
- నిర్మాణంలో భాగమైన సిబ్బంది 15,000
- ఉపయోగించిన స్పెషల్ గ్రేడ్ ఉక్కు: 21,500 టన్నులు
- ఏఏ విమానాలుంటాయి: మిగ్-29 విమానాలు, కమోవ్-31 విమానాలు, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లు, ఎంహెచ్-60
- టర్బైన్లు: 4 ఎల్ఎం 2,500 ప్లస్ గ్యాస్ టర్బైన్లు
- టర్బైన్ల సామర్థ్యం: 88 మెగావాట్లు
- పార్కింగ్: 6 హెలికాప్టర్లు, 12 జెట్స్, నైట్ ల్యాండింగ్
- ఆర్వో ప్లాంట్: 4 లక్షల లీటర్ల సామర్థ్యం
- వ్యయం: రూ. 20,000 కోట్లు
- సెన్సార్లు: 3 వేల ఫైర్ సెన్సార్లు,700 ఫ్లడ్ సెన్సార్లు
- ప్రత్యేకత: మిగ్-29 విమానాలు ఎగరగలిగే డెక్ ఉండటం
- ఫ్లైట్ డెక్ 12,500 చ.మీ. (రెండున్నర హాకీ ఫీల్డ్‌లతో సమానం)

సత్వర న్యాయం.. సామరస్య పరిష్కారం

- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వరరావు
- విజయవంతమైన మెగా లోక్ అదాలత్
- తుది సమాచారం మేరకు 5,920 కేసుల రాజీ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వరరావు

విశాఖ లీగల్: న్యాయ ఫలాలు అందరికీ అందించడమే న్యాయవ్యవస్థ అంతిమ లక్ష్యమని విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు అన్నారు. విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు న్యాయసేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయవ్యవస్థ మొత్తం కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన జస్టిస్ కృష్ణయ్య వంటి మహనీయుల మాటలను గుర్తు చేశారు. దేశంలో అట్టడుగు వ్యక్తికి కూడా రాజ్యాంగం చేరాలన్నదే మహనీయుల ఆకాంక్ష అని చెప్పారు. ఇరువర్గాలు ఇష్టపూర్వకంగా ముందుకు వస్తే కేసులు రాజీ చేయవచ్చని.. ఇటువంటి పరిష్కారం వల్ల భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. కుటుంబ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి రాధారత్నం మాట్లాడుతూ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు రెండు జీవితాలను, ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేస్తాయన్నారు. ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు అధిక ఫలాన్ని ఇస్తాయని చెప్పారు. ఇటీవల ఎన్నో కుటుంబాలు తిరిగి కలిసి ఉండడానికి ఇష్టపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎన్.వి.శేషమ్మ మాట్లాడుతూ రాజీకాగలిగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే సత్వర ఫలితాలు అందుతాయన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో 33 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. రాత్రి 7 గంటల వరకు 5,920 కేసులు రాజీ చేసినట్టు వెల్లడించారు. రూ.22 22 కోట్ల రాజీ రుసుం అవార్డు చేసినట్టు వివరించారు. శాశ్వత ప్రజా న్యాయ పీఠం న్యాయమూర్తి జి.వల్లభనాయుడు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్ పాల్గొన్నారు.

జెండా మోసిన కార్యకర్తలకు ప్రాధాన్యం





మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ విప్ ధర్మశ్రీ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, హాజరైన ముఖ్యనాయకులు, కార్యకర్తలు

- ఓడినా, గెలిచినా పార్టీకి స్థానిక నాయకత్వమే అండ
- నాన్ లోకల్ నాయకులు భీమిలికి అవసరం లేదు
- ముత్తంశెట్టివి అవకాశవాది రాజకీయాలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, మాజీ విప్ కరణం ధర్మశ్రీ

తగరపువలస: నియోజకవర్గంలో పార్టీ కోసం నిజాయితీగా జెండా మోసి గుర్తింపు తెచ్చిన ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం కింగ్స్ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఉపయోగపడినా పార్టీకి, కార్యకర్తలకు మధ్య అంతరం పెంచిందన్నారు. ప్రజలను ఒప్పించి పార్టీకి ఓట్లు వేయించేది కార్యకర్తలే తప్ప ఎమ్మెల్యేలు, ఎంపీలు కాదన్నారు. పార్టీని అధికారం తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేసిన కార్యకర్తల్లో ఆ బాధ ఉందన్నారు. దీనిపై పార్టీ అధినాయకత్వం సమీక్షించుకుంటోందన్నారు. పార్టీ పెట్టినప్పుడు, ఓదార్పు యాత్ర చేసినప్పుడు, పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ వెనుక ఉన్నది ముత్తంశెట్టి కాదని కార్యకర్తలేనని ఆయన గ్రహించాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఆరు మాసాల తర్వాత ఉద్యమిస్తే ఇంకా సమయం ఇవ్వాలని ముత్తంశెట్టి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చని ప్రభుతానికి ఆరు సంవత్సరాల సమయం ఇవ్వాలా అని ప్రశ్నించారు. రైతు సమస్యలపై పార్టీ ఉద్యమం చేస్తే రాష్ట్రం యావత్తూ కదిలి వచ్చిందన్నారు. కొడుకు పెళ్లి, కళాశాలల నిర్వహణ పేరుతో పార్టీకి దూరంగా ఉంటానని చెప్పి.. 24 గంటలు గడవక ముందే పార్టీని, జగన్‌ను విమర్శించడం ముత్తంశెట్టి అవివేకమన్నారు. ఆ వెంటనే గంటాతో చెట్టాపట్టాల్ వేసుకుని తిరగడం చూస్తుంటే జనం అసహ్యించుకుంటున్నారన్నారు. ఆయన వైఎస్సార్ సీపీలో ఉన్న ఐదేళ్ల ఎనిమిది నెలల కాలంలో.. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఐదేళ్లు అధికారం అనుభవించారన్నారు. రెండు నెలలు ఎన్నికల్లో, ఆరు నెలలు పార్టీకి దూరంగా ఉన్నారన్నారు. నాలుగు సార్లు పోటీ చేసి ఒక సారి ప్రతిపక్షంలో ఉండలేక అస్త్రసన్యాసం చేసిన ఇలాంటి నాన్ లోకల్ నాయకులు భీమిలికి అవసరం లేదన్నారు.

మాజీ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జెండాను మోసిన కార్యకర్తలను దిగుమతి నాయకులు మోసం చేస్తూనే ఉంటున్నారన్నారు. ముఖ్యంగా భీమిలితో పాటు జిల్లాలో ఈ పరిస్థితి ఉందన్నారు. నాలుగు సార్లు పార్టీలు, నియోజకవర్గాలు మార్చిన ముత్తంశెట్టి వెనుక కార్యకర్తలు, నాయకులెవరూ వెళ్లలేదని గుర్తు చేశారు. ఓడినా, గెలిచినా స్థానిక నాయకత్వమే పార్టీకి అండగా ఉంటుందన్నారు. గంటా, అరగంట వంటి నాయకులు ఆశ, నిరాశల మధ్య వెళ్లిపోతుంటారన్నారు. భీమిలి ప్రజలకు వైఎస్ జగన్ నాయకత్వంలో పార్టీ అండగా ఉంటుందన్నారు.

విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తలు గెలిపిస్తేనే ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రులు అవుతారన్నారు. స్వయం ప్రకాశం లేని ముత్తంశెట్టి వంటి వారు పార్టీని వీడినంత మాత్రాన వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. 2019లో టీడీపీ ఓటమి చెందిన తర్వాత ఆ పార్టీ నాయకులు బయటకు రావడానికి నాలుగేళ్లు పట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆరు మాసాల్లోనే బయటకు వచ్చి రైతు సమస్యలపైనా కన్నెర్ర చేశారన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తామన్నారు.

ఆనందపురం ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మరో ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, దాట్ల పెదబాబు, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పిల్లా సుజాత, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైస్ ఎంపీపీలు బోని బంగారునాయుడు, పాండ్రంగి శ్రీను, మండల, వార్డు అధ్యక్షులు బంక సత్యం, మజ్జి వెంకటరావు, బోని అప్పలనాయుడు, కోరాడ లక్ష్మణ, జగుపల్లి ప్రసాద్, శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, మైలపల్లి షణ్ముఖరావు, కదిరి ఎల్లాజీ, ఉప్పాడ నాగేశ్వరరావు, శిరిగుడి ఆదిబాబు, బాడితబోయిన రాములప్పడు, ఈర్ల ఈశ్వరరావు, అంజూరి అప్పారావు, డోల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకపక్షమే!

- 'కూటమి' కనుసన్నల్లోనే సాగునీటి సంఘాల ఎన్నికలు
- 168 ప్రాదేశిక నియోజకవర్గాల్లో పాలకవర్గాల ఏకగ్రీవం
- ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్ సీపీ

మహారాణిపేట: ప్రజాస్వామ్యం అపహాస్యమయ్యేలా నీటి సంఘాల ఎన్నికల తంతు జరిగింది. ప్రతిపక్షం లేకుండా ఉండేందుకు కూటమి నేతలు చేసిన కుట్రలకు అధికారులు శక్తి వంచన లేకుండా అండదండలు అందించారు. వారి అడుగులకు మడుగులొత్తుతూ పోటీలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు కూడా లేకుండా చేశారు. అన్ని చెల్లింపులు చేసిన వారికి కూడా నోడ్యూస్ సర్టిఫికెట్లు మంజూరు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో వైఎస్సార్ సీపీ నేతల జోక్యం లేకుండా ఉండేందుకు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. దీంతో ఈ ప్రక్రియ అప్రజాస్వామకంగా ఉందని వైఎస్సార్ సీపీ ఈ ఎన్నికలను బహిష్కరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో శనివారం జరిగిన అన్ని సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి.

జిల్లాలో 29 సాగునీటి వినియోగదారుల సంఘాల్లో 174 ప్రాదేశిక నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు. ఇందులో ఆరు మినహా 168 ప్రాదేశిక నియోజకవర్గాలకు పాలక వర్గాలు ఏకగ్రీవమయ్యాయి. భీమిలిలోని ఐదు నీటి సంఘాల్లో 30 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో కాపులుప్పాడ పరిధిలోని మూడు ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించలేదు. ఆనందపురం మండలంలో నాలుగు నీటి సంఘాల్లో 24 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. మూడు ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరగలేదు. పెందుర్తి మండలంలో 13 నీటి సంఘాల్లో 78 ప్రాదేశిక నియోజకవర్గాలు, పద్మనాభం మండలంలో ఏడు నీటి సంఘాల్లో 42 ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించారు. ముందుగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి.. పాలక వర్గాలను ఎన్నుకున్నారు. పాలకవర్గంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, నలుగురు సభ్యులు ఉంటారు. 29 మంది ఎన్నికల అధికారులు, 29 మంది అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 58 మంది పోలింగ్ అధికారులు, 58 మంది పోలింగ్ అసిస్టెంట్లు ఎన్నికల విధులు నిర్వర్తించారు.

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరుకానున్న రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంబా రవిబాబు, పండుల రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, కె.కె.రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, అదీప్‌రాజ్ హాజరవుతారని తెలిపారు. కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్యనాయకులతో పాటుగా పార్టీ శ్రేణులంతా కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఎవరైనా మా తర్వాతే..

- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అనుచరుల ఆగడాలు
- తమ కుటుంబ సభ్యుల దర్శనాలు తర్వాతే ఎవరైనా అంటూ హుకుం
- అవస్థలు పడుతున్న సామాన్య భక్తులు


ఎమ్మెల్యే వంశీ వర్గీయుల రుబాబు(ఫైల్)

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారిని మార్గశిర మాసంలో దర్శించుకునేందుకు ప్రతి ఒక్కరూ పరితపిస్తుంటారు. అమ్మ దర్శనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకుంటారు. అలాంటిది ఈ ఏడాది ఉత్సవాల్లో భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా గురువారం అయితే భక్తులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇందుకు కారణం స్థానిక జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ అనుచరవర్గమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే అండతో అతని అనుచరులు పవిత్ర ఆలయంలో రెచ్చిపోతున్నారు. మా తర్వాతే ఇంకెవరికైనా అమ్మవారి దర్శనం అంటూ రుబాబు ప్రదర్శిస్తున్నారు. ఓ వైపు చంటి పిల్లలతో తల్లిదండ్రులు, వృద్ధులు, వికలాంగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు అమ్మ దర్శానికి వచ్చి గంటల తరబడి క్యూల్లో ఉంటుంటే.. వంశీ వర్గీయులు మాత్రం దర్జాగా వచ్చి లోపలికి ప్రవేశిస్తున్నారు. ఇదేంటని అడిగిన సిబ్బందిపై అంతు చూస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారు. ఎటూ చెప్పలేక ఆలయ వర్గాలు మిన్నకుండిపోతున్నాయి.

ఎమ్మెల్యే అనుచరుల అత్యుత్సాహం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు గంటల తరబడి క్యూల్లో నిలబడి, తమ వంతు వచ్చే వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. అమ్మవారి ఆలయంలో ఇలా ప్రవర్తించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మ దర్శనానికి వస్తే.. ఆయన వెంట వందలాది మంది అనుచరులు లోపలికి ప్రవేశించి గందరగోళం సృష్టిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలే కాకుండా.. తూర్పు నియోజకవర్గం నుంచి కూడా ఆయన వర్గీయులు తరలివచ్చి హడావిడి చేస్తున్నారు. ఈ పరిస్థితి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. దీనికితోడు ఆలయ ఆదాయానికి గండిపడుతోంది.

పోలీసుల తీరు అంతే..

ఉత్సవాల్లో పోలీసుల తీరూ విమర్శలకు తావిస్తోంది. ఏసీపీ కాళిదాసే పోలీసుల తీరు చూసి నివ్వెరపోయారు. భక్తులకు భద్రత కల్పించాల్సిందిపోయి.. పోలీస్ కుటుంబ సభ్యుల కోసం పరితపిస్తుండడం సరికాదని వన్‌టౌన్ సీఐ దేముడుబాబుపై ఒకింత అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు బందోబస్తు కంటే తమ బంధువులు, కుటుంబ సభ్యుల దర్శనాలకు ప్రాధాన్యమివ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అనుచరులు, పోలీసుల తీరుతో సామాన్య భక్తులతో పాటు రూ.100, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారు కూడా అవస్థలు పడుతున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటినప్పటి నుంచి గురువారం రాత్రి పొద్దుపోయే వరకు వీరి హడావిడితో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం భాగ్యం దక్కడం లేదు. ఈ ఏడాది మార్గశిర ఉత్సవాల్లో భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భక్తులు ఆరోపిస్తున్నారు.


తమ కుటుంబ సభ్యులను దర్శనాలకు పంపించేందుకు పరితపిస్తున్న పోలీసులు(ఫైల్)

రూ.500 టికెట్ తీసినా ప్రతిఫలం లేదు..

సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకునేందుకు నా కుటుంబంతో కలిసి వచ్చాను. రూ.500 చొప్పున టికెట్లు తీసుకున్నాం. కానీ అమ్మ దర్శనానికి చాలా సేపు క్యూలోనే ఉన్నాం. అంత ఖరీదు పెట్టి టికెట్ తీసుకున్న అమ్మ దర్శనం బాగా జరగలేదు. అసంతృప్తిగానే బయటకు వచ్చాం.

– యేగిరెడ్డి రాము, పార్వతీపురం మన్యం జిల్లా

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య: దేశ రాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఏయూ జాతీయ సేవా పథకం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది విద్యార్థులు ఎంపిక కాగా ముగ్గురు ఏయూ విద్యార్థులు కావడం గమనార్హం. ఇటీవల ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేశారు. నెలరోజులపాటు వీరు దేశ రాజధానిలో శిక్షణ పొంది జనవరి 26న జరిగే పరేడ్‌లో భాగమవుతారు. ఆనందపురం ఏక్యూజే పీజీ కళాశాలకు చెందిన యు.గణేష్, మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలకు చెందిన పి.దివ్యశ్రీ, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన గుడ్ల కుశాంక ఏయూ తరఫున ఎంపికైనట్లు ఉత్తర్వులు ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్‌కి అందాయి.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అప్పగింత


రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు


బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు

తాటిచెట్లపాలెం: వివిధ రైళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న/మరచిపోయిన మొబైల్ ఫోన్లను శనివారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు సంబంధిత వ్యక్తులకు అందజేశారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు పర్యవేక్షణలో రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ వద్ద శనివారం డిసెంబర్ రికవరీ మేళా జరిగింది. ఈ సందర్భంగా ఇన్ఫినిక్స్-2, ఐక్యూ-1, లెనోవా ట్యాబ్-1, మోటరోలా-4, నోకియా-1, వన్‌ప్లస్-6, అప్పో-6, పోకో-3, రియల్‌మీ-13, రెడ్‌మీ-7, సాంసంగ్-9, వివో-9 ఫోన్‌లను బాధితులకు పలు తనిఖీల అనంతరం అందజేశారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు వరకు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు తెలిపాడు. తమ మొబైల్స్‌ను అందించిన జీఆర్పీ పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

‘మైత్రి’ జోష్



విశాఖ విద్య: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఏయూ హ్యూమన్ జెనిటిక్స్, ఏక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మైత్రి వాక్ నిర్వహించారు. ఏయూ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద దివ్యాంగులు కొద్ది సేపు ఆడి పాడి సందడి చేశారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, యంగ్ ఇండియన్ సభ్యురాలు కావ్య పూర్ణిమ మాట్లాడుతూ దివ్యాంగుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏక ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ కె.శాంతి, ఏయూ జెనిటిక్స్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థుల నృత్యాలు



మైత్రి వాక్‌లో దివ్యాంగ విద్యార్థులు, నిర్వాహకులు

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు


డ్రా తీస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీలో విశాఖ ప్రాంతీయ పాలిటెక్నిక్ కాలేజీల ఫిజికల్ డైరెక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించి డ్రా తీశారు. ఎలక్ట్రికల్ హెడ్‌కే డీవీ నరసింహారావు, సివిల్ హెడ్ జి.రాజేంద్రప్రసాద్, మెకానికల్ హెడ్ బి.తులసీరావు, జనరల్ హెడ్ కె.వాణి, పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

స్పోర్ట్సు మీట్ వివరాలు : ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఏయూ రీజియన్ పరిధిలోని 27 పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన 1,200 మంది క్రీడాకారులు పాల్గొంటారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ వేదికగా మూడు రోజులు నిర్వహించనున్న ఈ మీట్‌లో అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కోకో చెస్ క్రీడలు నిర్వహిస్తారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో 100, 200, 300, 400, 800 మీటర్లతో పాటు, 100 మీ x 4 రిలే మీట్ ఉంటుంది. త్రో డిస్కస్, షాట్ పుట్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్ పోటీలు ఉంటాయి.

సమ్మోహనభరితం.. నృత్యోత్సవం


ప్రముఖ నృత్య కళాకారుడు మొసలి కంటి కిశోర్‌కి అవార్డు ప్రదానం చేస్తున్న కన్నం వెంకటరమణ బృందం


నృత్య కళాకారుల నాట్య విన్యాసాలు

మద్దిలపాలెం: విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ సౌజన్యంతో గురు పరంపర-2024 జాతీయస్థాయి నృత్యోత్సవాలు సమ్మోహన భరితంగా జరిగాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం జరిగిన ఈ నృత్యోత్సవాల్లో నగరంలోని పలు కళా సంస్థల నృత్యకళాకారిణుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంతర్జాతీయ ఒడిస్సీ నాట్య కళాకారుడు ఆర్య దత్త, అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి డాక్టర్ గర్మి ఆర్య నృత్య ప్రదర్శనలు కళా హృదయాలను రంజింపచేశాయి. అనంతరం కళారత్న వెంపటి రవిశంకర్ జీవితసాఫల్య పురస్కారాన్ని అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారుడు మొసలి కంటి కిశోర్‌కు ప్రదానం చేశారు. అసోసియేషన్ కన్నం వెంకటరమణ రావు, ఆంధ్రప్రదేశ్ సీడ్స్ అండ్ అగ్రికల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, విశాఖ మ్యూజిక్ అకాడమీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో తాబేళ్ల కళేబరాల కలకలం


తీరానికి కొట్టుకుని వచ్చిన తాబేళ్ల కళేబరాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తీరం వద్ద పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కలకలం సృష్టిస్తున్నాయి. వాస్తవానికి భీమిలి తీరం నుంచి సాగర్‌నగర్ తీరం వరకు అప్పుడప్పుడు తాబేలు కళేబరాలు ఒకటి లేక రెండు కనిపిస్తుంటాయి. గత రెండు రోజుల నుంచి మంగమారిపేట తీరం వద్దకు కళేబరాలు కొట్టుకుని వస్తున్నాయి. గురువారం నాలుగు తాబేలు కళేబరాలు, శుక్రవారం రెండు తాబేలు కళేబరాలు, శనివారం రాత్రి ఏకంగా పది తాబేలు కళేబరాలు తీరానికి కొట్టుకుని వచ్చాయి. దీంతో మత్స్యకారులు కాస్త ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తాబేళ్ల వలస వెళ్లే సమయం కావడంతో.. వందల సంఖ్యలో తాబేళ్ల గుడ్లు పెట్టుకునేందుకు అనువైన స్థలం అన్వేషించుకుంటాయి. ఈ క్రమంలో తీరానికి వస్తున్న సమయంలో వేటకు వెళ్లే మత్స్యకారుల వలలు, గేలం వంటివి తగలడంతో ఎక్కువగా మృత్యువాత పడుతుంటాయి. అలాగే ఒడ్డుకు చేరుకుంటున్న తరుణంలో శ్వాస అందక ఎక్కువ శాతం మృత్యువాత పడుతుంటాయని జువాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ భరత లక్ష్మి తెలిపారు. ఒడిశాలోని రుషికొల్యా తీరంలో ఈ సీజన్‌లో వేల సంఖ్యలో తాబేళ్లు మృత్యువాత పడుతుంటాయని ఆమె తెలిపారు.

అల్లు అర్జున్ అరెస్టు బాధ కలిగించింది

సినీ నటి శ్రీలీల



దాబాగార్డెన్స్: సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టుపై యావత్తు సినీరంగం బాధ పడిందని.. తాను ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు హీరోయిన్ శ్రీలీల అన్నారు. డాబాగార్డెన్స్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లు అర్జున్ అరెస్టు తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. ఆయన బెయిల్ రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై 17న ఏక సభ్య కమిషన్ రాక

మహారాణిపేట: షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ కోసం ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా(విశ్రాంత ఐఏఎస్) నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖ జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు కె.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఉప వర్గీకరణ విషయంపై సంతకంతో కూడిన రాతపూర్వక వినతిపత్రాలు కమిషన్‌కు అందజేయవచ్చన్నారు. 18న ఉదయం 11 గంటల నుంచి రెండు గంటల లోపు కలెక్టర్ కార్యాలయంలో వినతులు స్వీకరణ ఉంటుందన్నారు.

ఇంధన పొదుపు.. భవితకు మదుపు

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, అధికారులు

సీతమ్మధార: ఇంధన వనరులను పొదుపు చేయాలని, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులకు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం గురుద్వారా వద్ద గల సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ భావితరాల అవసరాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంధన వనరులను వృథా చేయరాదని, విద్యుత్ పొదుపు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 20 వరకు పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌ఈడీ బల్బుల వినియోగం, ఇంధన పొదుపు చిట్కాలు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, కళాశాల విద్యార్థులకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈపీడీసీఎల్ ఉద్యోగులంతా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్ఈలకు ఆదేశాలిచ్చారు. విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ జి.శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పోలాకి శ్రీనివాసరావు, బి.కె.నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుమన్, పి.జ్యోతి, సి.హెచ్.రామభద్రశాస్త్రి పాల్గొన్నారు.